# స్త్రీల వేసంగిపాఠశాల, బాపట్ల

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

విద్య, ఆరోగ్యము, వైద్యము, రాజకీయము, సాంఘికము, సహకారము, గ్రామ పునర్నిర్మాణము ఆదిగాగల పెక్కు విషయములలోగాని, లేక యేదేనొక ప్రత్యేక విషయములోగాని యువజనులలో జ్ఞానాభివృద్ధి కలిగించు నిమిత్తము వేసంగి పాఠశాలలను స్థాపించుట కొన్ని సంవత్సరములుగా మన ఆంధ్ర దేశములో జరుగుచున్నది. కాని యివన్నియు పురుషుల పాఠశాలలే. ఈ పాఠశాలలయందు కొందఱు స్త్రీలుగూడ శిక్షణము బడసి యుండవచ్చును. కాని స్త్రీలకు ప్రత్యేకముగా వేసంగి పాఠశాల నింతవఱకెవరును స్థాపించలేదు. పురుషుల వేసంగి పాఠశాలలలో జరుగుచున్న కార్యక్రమము పత్రికలలో చదువుచున్నప్పుడు స్త్రీలకుగూడ నిట్టి పాఠశాలలను స్థాపించుచుండిన నుపయుక్తముగా నుండునని తలచుచుంటిని. స్త్రీ సమాజములను స్త్రీ విద్యా సంస్థలను నడుపుచున్న కొందఱు నారీమణులతో ప్రస్తావనచేసియుంటిని. కాని యెవరును సుముఖమైన ప్రత్యుత్తరమీయలేదు.

బాపట్ల సేవాసమితివారు ఈ సంవత్సరము వేసంగిలో పురుషులకు వేసంగి పాఠశాలను నడుపుటకు నిశ్చయించుకొని స్త్రీలకు గూడ నొక ప్రత్యేక తరగతి పెట్టవలెనని తలంపుకలిగి దీని నిర్వహణభారమును నన్ను వహింపవలసినదని కోరిరి. స్త్రీల కిట్టి పాఠశాలలుండవలెనని నే నిదివఱకే అభిలాషపడుచున్నందు వలన వారు కోరినంతనే అంగీకరించితిని.

బాపట్లయందలి స్త్రీహితైషిణీమండలిలోనే స్త్రీల వేసంగి పాఠశాలయే పదునేడవ తేదీ మొదలు ఒక నెలదినములపాటు అవిచ్ఛిన్నంగా జరిగినది. పురస్త్రీలు చాలమంది ఉత్సాహముతో పాఠశాలలో జేరినారు. విద్య, వైద్యము, ఆరోగ్యము, గ్రామ పునర్నిర్మాణము, గృహనిర్వాహకత్వము, గృహపరిశ్రమలు, ప్రపంచజ్ఞానము, యుద్ధ పరిస్థితులు, స్త్రీల ధర్మములు, స్త్రీల బాధ్యతలు, స్త్రీల సమస్యలు, అంతర్జాతీయ న్యాయశాస్త్రము, ఆత్మజ్ఞానము, కావ్యపరిశీలనము, అస్పృశ్యతా సమస్య, ఆదిగాగల విషయములపై దాదాపు పదునార్గురు విద్యాధికులు ఆయా విషయములందు ప్రావీణ్యత అనుభవము కలవారు, ఉపన్యసించినారు. వీరిలో నలువురు స్త్రీలుగూడ గలరని తెలుపుటకు సంతసమగుచున్నది. కొందఱు పొరుగూరులనుండి ఆహ్వానింపబడిరి. కొందరు పురప్రముఖులే. ఒకరు అయిదు ఉపన్యాసములను ఒకరు నాల్గుపన్యాసములను, ముప్వురు రెండేసి ఉపన్యాసములను యిచ్చిరి. వీనితోబాటు ఉదయవేళ బాలికలకు సూర్య నమస్కారములును హిందీ పాఠములును నేర్పబడినవి. సాయంత్రము నాల్గుగంటలనుండి ఆరువఱకు ప్రతినిత్యము స్త్రీలకు ఉపన్యాసము లీయబడినవి. ఇంతలో వేసంగి పాఠశాలల నిషేధిస్తూ దొరతనంవారు గావించిన ఉత్తరువు వలన పాఠశాల ఆగిపోయి, యిందు రాజకీయముల ప్రసక్తిలేదని గవర్నమెంటువారు పరిశీలించిన మీదట పునరుద్ధరింపబడి కొంత పనిచేసి గత జూలై 27 తేదితో సమాప్తము చేయబడినది.

నడుమ గల్గిన అంతరాయమువలన అనుకొనిన ప్రకారము ప్రత్తి విడదీయుట, ఏకులుచేయుట నూలువడకుట, మాల్టులు తయారుచేయుట, మాల్టునుండి బిస్కట్లు వగైరాలు చేయుట, సబ్బులు తలనూనెలు తయారుచేయుట మొదలగు ప్రత్యక్ష ప్రదర్శనములును, రోగుల ఉపచర్య, ప్రమాదములకు ప్రారంభచికిత్స,

శిశుపోషణ, సహకార సంఘములు, ఆరోగ్యశాస్త్రము, అర్థశాస్త్రము మున్నగు వానిపై నిప్పింపదలంచిన ఉపన్యాసములును జరుగకపోయినను పూర్వానుభవ మేమాత్రమునులేక నూతనముగా అవ్యవధిగా తలపెట్టబడి ప్రభుత్వ నిషేధాది అంతరాయములచే నడుపబడిన పాఠశాలలో నీపాటి కార్యక్రమమైనను సక్రమముగా జరుప గలిగినందుకు సంతోషింపవచ్చును. తమ సేవాసమితి పక్షమున స్త్రీల తరగతిని నెలకొల్పుటయేగాక వీని నిర్వహణమున అత్యంతశ్రమపడిన సేవాసమితి అధ్యక్షులును కార్యదర్శులునునగు మ-రా-శ్రీ వేదాంతం వాసుదేవరావుగారును, పంగులూరి మాణిక్యారావుగారును, లక్కరాజు భార్గవీ మనోహరరావుగారును నెంతయు వంద్యులు.

ప్రభుత్వమువారి అనుమతిని ముందుగానే పొంది ఆరువారములకు సరిపడిన నికరమైన బోధనా ప్రణాలికను నేర్పరచుకొని ఒక్కొక్కవక్తి ఒక్కొక్క విషయముపై మూడునాల్గుపన్యాసములకు తక్కువ లేకుండా నొసంగి ప్రతి ఉపన్యాస సారాంశములను విద్యార్థినులు జాగ్రత్తగా వ్రాసిపెట్టుకొని వానిపై పరీక్షాపత్రముల నిచ్చు నేర్పాటులు చేయబడినచో వేసంగి పాఠశాల స్త్రీలకు అత్యంత ప్రయోజనము కలిగించగలదు. వీనితోబాటు వారమున కొకవినోద కార్యక్రమముగూడ నుండిన పాఠశాల మరింత ఆకర్షణీయము కాగలదు. పొరుగూరినుండి ఉపన్యాసకులను రప్పించుట, మ్యాజిక్ లాంతరులు, భూగోళపటములు వగైరాలు సంపాదించుట, కొంచెము కష్టముగాన పల్లెటూరులలో నిట్టి పాఠశాలలను నిర్వహించుట వ్యయ ప్రయాస సాధ్యము కావచ్చునుగాని బస్తీలలో వీనిని సులభముగా నిర్వహింపవచ్చును. ఎవరి భోజనఖర్చులను వారు భరించుచో పొరుగూరివారుగూడ పాఠశాలలో చదువుకొను నేర్పాటులు చేయవచ్చును. సాధ్యమైనంత తక్కువకాలములో నెక్కువ విజ్ఞానమును, ఉపన్యాసాది సులభమార్గముల ద్వారా బోధించుటయే వేసంగి పాఠశాలల ముఖ్యోద్దేశము కాన పాఠశాలలలో సంవత్సరములకొలది చదువుట కవకాశములేని విజ్ఞాన పిపాసగల స్త్రీ లీ పాఠశాలలో చేరినచో మిక్కిలి ప్రయోజనము బడయగలరు. ఆంధ్రదేశమునందలి స్త్రీ సమాజములవారును, స్త్రీ విద్యాసంస్థలను నడుపువారును, ఏటేట యిట్టి స్త్రీ వేసంగి పాఠశాలలను నడుపుటకు పూనుకొని స్త్రీల విద్యా విజ్ఞానముల నభివృద్ధిజేయ యత్నింతురను నాసతో నీ విషయమును గృహలక్ష్మియందు వెల్లడించితిని. నా విశ్వాసము వమ్ముగాదని నమ్ముచున్నాను.